# ఓ పట్టు పట్టు

రంగారావు బాబుకి అమ్మోరు కల్లోకొచ్చిందటంటే అమ్మోరు కల్లోకొచ్చిందటని వీధి వీధంతా తెల్లారి పదో గంట కల్లా చర చరా పాకిపోయింది.

"అమ్మోరు ఏంటంటది ?"

"రంగారావుబావు ఇంటి గుమ్మంనేదా...గుమ్మానికి సరింగా ఎదురుగ్గా రోడ్డుమీద ఆయమ్మ కలసవో పెట్టింది నిన్న. చూరులెగదియ్యమంద్రిటా అమ్మోరు"

'అదుస్టమంతుడా బావు. ఎంత పున్నెం సేసుకుండో. కాపోతే ఆ బావు కల్లోకమ్మోర్రావడవే అదుస్టం. ఆపైని ఆబావు గుమ్మం ఎదార కూకుంటానంటే ఇంకేటి సెప్పాల'

ఆ వీధి ఈవాసా అవాసా పెద్దా చిన్నా అంతా రంగా రావుగారి మేడ దగ్గర హాజరయ్యేరు. ఆయన నోటిద్వారానే అంతా విందామని.

"రాత్రి కసింత పొద్దోయి తొంగున్నారా ఏంటి ? నీను తొంగునే ఏళ్టకి రొండో మూడో అవుద్ది. కొత్త కమిషనరు ఒచ్చేరుకదా...నిన్న పార్టీ సేసే రూళ్ళోని పెద్దలంతా.అయిందా? నానొచ్చేసరికి మా యావిడ నిద్దరలోవున్నాది. దగ్గరసా

ఎల్లీసరి కొరే గజగజా గజాగజా ఒకటే ఒణుకు. నీను కాదురా మా ఆవిడ. ఒణికిపోవటం, సెవట్లు పట్టీటం, గజగజ లాడిపోడం, నీరు కారిపోడం మరేంటిసెయ్యానురా బగమంతుడాని మా పెద్ద ఆలోచించిన మీదట మనడాట్రు జెగన్నాథం లేడా....మన పెద్దీది డాట్రు ... పోను సేద్దారని పోను తీస్తే ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ మని ఎంత మోగించినా ఎవలూ తియ్యరే ? ఇంకేటి సేద్దును ? మిమ్మల్ని లేపీదా...నా ఇంట్లో గాభరాకి మిమ్మల్నెలా గిబ్బంది పెట్టేద్దును ? మరింక నాబంనేదని తిన్నగా దేవుడి గదిలో కెళ్ళేను. ఈస్వేరుడికి దణ్ణవెట్టేను. ఎంకట్రవణమూర్తికి దణ్ణ వెట్టేను. మనూరి తల్లి అమ్మోరికి దణ్ణవెట్టేను. మరింక వొచ్చి చూద్దును, మాయావిడ నిశ్చింత నిస్పూచీగా నిద్దరబోతున్నాది. మరింక పూచీ పేచీ లేదురా అని నీనూ తొంగున్నాను. మరిం కేంటి ధన్నమని కళ్ళల్లోకి దిగీసిందిరా అమ్మోరు.మరి నీ దణ్ణా నికి దారి సూపించేను గదా, నియ్యింటి కెదరగా కూకుడుంటాను, నా దారికి దణ్ణ వెట్టించు పెజల్చేత అందిరా. అండవంటే ఇలాగలాక్కాదు చెవ్వులు బద్దలయిపోయేయనుకో. మరింక నాకు మాట పెగులుద్దా ? చచ్చి గింజుకున్నా మాటరాదే. సరే ఒరం రోజులు గడువిస్తన్నానని నా పీఠంమీద సవాల్జేసి మరీ లెగిసెళ్ళిపోయిందమ్మోరు. అమ్మోరెళ్ళి పోడవేంటి లెగిసి సూద్దునుకదా తెల్లారైదు గంటలు కొడతన్నాది' అంటూ ముగించేడు రంగారావు.

అంతవరకూ నోరెళ్ళబెట్టి విన్నా కూడా సగం మంది మాత్రం నమ్మేరు. లేదా నమ్మేసినట్టు కన్పించేరు. కొంతమంది మాత్రం "ఓస్ పెద్ద బత్తుడు దిగొచ్చేడురా" అంటూ దులపరించుకు వెళ్ళిపోయేరు.

రంగారావు మేడ పక్కనే రంగారావు బావమర్ది డాబా యిల్లు. ఆ డాబా యింటి ముందు మూగేరు వీధి వాళ్ళంతా.

"ఒరే మీరంతా ఎందుకొచ్చేరు, కష్టాలైనా సుకాలైనా సరిసమానంగ అనుబగించాలని కదా మసీది కట్టు. ఈ కట్టు ఇండానికే గాని ఆ మాట నిలబెట్టుకోడానికి లేదేంట్రా? నిన్న నాకైంది, ఇయ్యాళిడికైంది, రేపు మరోడికైంది. మరింకా మర్నాడు సూస్తా వూరుకోదురా అమ్మోరు. వీధి వీధంతట్నీ సీపురు కట్టెట్టి తుడిసీస్ది. అంతే కాదుకోరె, అమ్మోరు చెప్పినట్టు మీరు కూడా సేసిరా....మరి...మసీదొంక పరమసివుడు కూడా కన్నెత్తి సూళ్ళేడు. ఆ పైన మీయిస్టం" అని బామ్మర్దింట్లో కులాసాగా కూర్చొని కంటసంగా మాటాడేడు రంగారావు.

ఈ దెబ్బతో అమ్మోరికి భయపడో లేకపోతే వీధిలో మోతుబరీ, పలుకుబడికల రంగారావు దగ్గర అప్పులూ, తాకట్టూ వుండడం చేతనో వీధిలో వాళ్ళంతా (వప్పుకున్నారు. ఒప్పుకోవడమేమిటి అమ్మోరన్న మాట ప్రకారం వారం రోజులకల్లా కలశం ప్రతిష్టించడం, దాని మీద ఓ ఆరడుగుల ఎత్తు గోపురం లాంటిది కట్టించెయ్యడం జరిగిపోయింది. ఓ మంచి మంగళవారం చూసి పండక్కూడ చేసీసుకున్నారు.

అమ్మోరి పండుగనాడు సుష్టుగా పులిహోర, దద్దోజనం, బూర్లూ, గారెలూతో భోజనం చేసి మధ్యాహ్నం వాలుకుర్చీలో దర్జాగా, ధీమాగా కూర్చున్నాడు రంగారావు. కమీషనరు గారికి విందు చేసిన రోజు తర్వాత రంగారావు సుబ్బరంగా, ధీమాగా కూర్చున్నదారోజే.

మున్సిపల్ కమీషనరుగారికి విందు చేసిన రోజు, ఏదో మాటల సందర్భంలో కమీషనరు అన్నారు "మీ వూరు కొద్ది రోజుల్లో బాగా డెవలప్ అయిపోతుందండీ రంగారావు గారూ. ముఖ్యంగా మీ వీధి చూసేరూ అది బైపాస్ రోడ్ చేసే ప్రపో జల్ హైదరాబాదులో వచ్చింది. మీ ఇంటి వరసంతా ఎంక్రోచ్ మెంటే, బహుశా పోవచ్చునేమో".

గుండెలు గుబుక్కుమన్నాయి రంగారావుకి. అయినా పేదలకి పెద్దబాబు అని పేరు తెచ్చుకున్నాడు. అంత తొంద రగా వదుల్తాడా తను. "అదెలాగ్గవుద్దండీ మా యీది మా యింటొరసలో మాలాంటోళ్ళం తిరగా కట్టుకుంటానికి కాయిత వెట్టుకుంటే ప్లేన్ ఎప్రూవ్ సేసింది మునిసిపాల్టోళ్ళే కదండి... ఎంక్రోచ్ మెంటయితే అప్పుడెలాగ సేసినట్టు?"

"అప్పుడేదో తిరకాసుల్తో బురిడీ కొట్టించేస్తే అప్పట్లో కౌన్సిల్ కదా ఉండేది ఎప్రూవ్ చేసీసుండాలి. ఏదేమైనా ఇది హైద్రాబాద్ నుండి వొస్తున్న ప్రపోజల్. తిరుగుండదు" అని ఇంకేదో టాపిక్‌లోకి దిగిపోయేడు కమీషనరు.

ఆ లెక్కన రంగారావు మేడ రోడ్ పాయింట్ నుండి సుమారు పదడుగులు-అంటే ముందున్న గదంతా-పోతుంది. పక్కన బావమరిది ఇల్లు రోడ్ పాయింట్‌కి కొంత దూరంలో

ఉండటంవల్ల ఓ అయిదడుగులు మాత్రం పోతుంది. ఇలాగే ఆ వరస ఇళ్ళన్నీ మూడో, రెండో, ఒకటో చివరికి మెట్లయినా కొట్టేయ్యాల్సి వుంటుంది.

ఇంక ఆ రోజు విందు నోటికి చేదయి పోయింది. ఆ రాత్రి నిద్ర కంటికి దూరమయిపోయింది. మెదడులో ఆలోచనలు ముళ్ళుపడిపోయాయి. అద్గదో అలాంటి సమయంలో వొచ్చిందమ్మోరు కల్లోకి. ఆ రోజు తర్వాత ఈ రోజే కడుపు నిండా భోంచేసేడు. కంటి నిండా నిద్రపోయేడు.

కాని సరిగ్గా ఆ మరుసటి మంగళవారం తెల్లవారేసరికల్లా మున్సిపల్ కమీషనరు బృందం వీధిలో విహారానికి తయారు! ధీమాగానే వెళ్ళి పలకరించేడు రంగారావు. "దణ్ణాలండీ కమీషనరుగారూ! ఏటిలా పొద్దున్నే దర్శనం యిప్పించీసేరు. మనింటికి దైసేయించి మదర్పితసెందన తాంబూలాలు" అంటూ మొదలెట్టేడు చమత్కారంగా.

"లేదండీ రంగారావుగారూ. చెప్పేనుకదూ హైద్రాబాద్ ప్రపోజలని, దానికి ప్లాను ప్రకారం మార్కు చేయించడానికి వచ్చేను. గుర్తులు పెట్టించినంత మేర మీ వీధిలో ఇళ్ళన్నీ కొట్టేస్తే సరేసరి, లేదా మా వాళ్ళే ఆ పని చేసేస్తారు." అన్నాడు కమీషనరు.

నడుం సటుక్కుమంది రంగారావుకి. అయినా నిబ్బరంగానే 'ఏటి కమీషనరు గారూ, తెల్లారే ఆసికాలాడ్డాని కొచ్చినట్టు గున్నారు' అని అన్నాడు."లేదండీ. నిజం, యింతకు ముందు మీకు చెప్పినట్టున్నాను కూడా" అని కన్ఫర్మ్ చేసేడు కమీషనరు.

"ఆసికాలు కాపోతే ఏటండి? మా ఇళ్ళంటే కొట్టేస్తారో కొట్టేసుకుంటావో సేస్తాం. కాని అమ్మోరి గోపురం సరింగా రోడ్డుకి నడమజ్జినున్నాది కదా. రోడ్డెడల్పెలాగ సేస్తారు. అమ్మోరి గోపురవంటే మనిందూ మతానికి సిన్నం. మరిగ లాంటి సిన్నాలన్నీ మట్టిపాల్సెయ్యడానికి మన రాజ్జెంగం వొప్పుద్దా? రాజ్జెంగ వొప్పినా వొప్పకపోయినా అమ్మోరొప్పుద్దా? తన గుడి నేలకరిపించినోడిని సర్వనాసనం సెయ్యకుండా ఒగ్గుద్దా? మరి గంచేత నేటంటే కమీషనరుగారూ మియ్యన్నీ ఏలాకోలాలంటున్నాను" అని మళ్ళీ ఓ నవ్వు నవ్వేడు రంగారావు.

"ఇన్నేళ్ళనుండీ మున్సిపల్ జాగా ఆక్రమించి అనుభవించడమే తప్పు. ఆతప్పు కప్పుకోడానికి మతాన్ని ఉపయోగించబోవడం ఎ గ్రేట్ గ్రేండ్ ఎర్రర్. ముందు ఇళ్ళ సంగతి చూడండి. వారం రోజుల్లో జరగాలి. ఇక అమ్మవారి గోపురం సంగతి. అది అమ్మవారి గోపురవనేకన్నా రంగారావు అధికారంకి రక్షణగా అభివృద్ధి నిరోధక శక్తుల్లాంటి గోడ కట్టి తెలివి తేటల వెల్లవేసిన కోట మాత్రమే ఇది.అయినా పర్మిషను లేకుండా కట్టిన గోపురం. దీని సంగతి పై అధికారులు చూసుకుంటారు." అప్పటికే చేరిన ఆ వీధి వాళ్ళ నుద్దేశించి అన్నారు కమీషనరు గారు. అటు సర్వేయర్లకీ సూపర్ వైజరుకీ మార్కు చేయించేపని పురమాయించేరు. ఆ వేళ

సాయంత్రానికి ఆ పని పూర్తయి బృందమంతా వెళ్ళిపోయేసరికి రంగారావు మేడ దగ్గర ఆ వీధి వాళ్ళంతా చేరేరు.

"ఏటి రంగాయ్ మావా ఇలాగచేసినావ్? ఇళ్ళన్నీ కొట్టిస్తంటే ఊరికే సుట్టకాలుస్తా కూకున్నావేటి?" అని ఒకరూ, "మిమ్మల్ని కమీషనరు బావన్ని మాటలంటంటే వొల్లకున్నారేటి బావూ?" అని మరొకరూ, "ఏట్రా అల్లుడూ దీనికేటన్నా అవుడియా ఆలోచించినావా నేదా?" అని ఇంకొకరుగా ప్రశ్నల రూపంలో చుట్టుముట్టేసి ఉక్కిరి బిక్కిరి చేసేసేరు.

"ఓరెల్లంద్రా....మీరు నన్నడిగే వోళ్ళా నేను మీకు సెప్పేవోణ్ణి అయ్యేనేంట్రా. అయినా రొండు ముక్కలాలకించండి సెప్తన్నా. కమిసనరోడికింత లంచవెట్టయినా గుమ్మాలు కొట్టడవాపించాల....రొండోదేటంటే ఇయ్యేవీ పనికి రాకపోతే కోర్టుకెక్కాల. ఈ రెండింటికీ మీరంతా సిద్దవేనంట్రా." అని తీక్షణంగా ఆలోచించి తీవ్రంగా చూసి సూటిగా అడిగేడు రంగారావు. దానిమీద తీక్షణంగా తర్జన భర్జనలు జరిగేయి. తీవ్రంగా కొట్టుకున్నారు మాటల్తో. సూటిగా సమాధానం చెప్పేరొక్కమాటగా.

"లంచం పుచ్చుకుంటే సరేసరి లేకపోతే రెండోసారి మళ్ళీ ఎవరిచేతనైనా ఏదో డబ్బు ఇప్పించినట్టే ఇప్పించి లంచం తీసుకుంటున్నాడన్న నేరం మోపించి శంకరగిరి మాన్యాలు పట్టించేద్దాం" అనీ ప్లాను వేసేడు రంగారావు.

మొదటికే మోసం వచ్చింది. "లంచం ఇవ్వడం నేరం. ఇలాంటి పనులు చేస్తే రిపోర్టుచెయ్యాల్సి ఉంటుంది" అని చూపుడువేలు ఝూడించి మరీ చెప్పేడు కమీషనరు.

లీగల్‌గా ప్రొసీడవడానికి పర్మిషను కూడా అడిగేరు. రంగారావు "ఇవ్వడానికి నాకేం అభ్యంతరం లేదు గాని ఏభయ్యేళ్ళ నాటి మున్సిపాలిటీ ప్లానూ, డాక్యుమెంట్సూ నా దగ్గరున్నాయ్. అందులో మీవన్నీ ఎంక్రోచ్‌మెంటన్న విషయం స్పష్టంగా వుంది. ఆపైన స్వెషలాఫీసర్ని. ఇంక మీ ఇష్టం" అని ముక్తసరిగానే చెప్పినా ముక్కుమీద గుద్దినట్టు మరీ చెప్పేడు కమీషనరు.

అంతే. పెద్ద శబ్దం చేసుకుంటూ ధీమాగా బుల్‌డోజర్ నడుస్తుంటే అమ్మోరి గోపురం, రంగారావు మేడలో కొంత భాగం దానికింద నుగ్గునుగ్గయి పోయేయి ! ★